క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం

విశాఖలోని దక్షిణ నియోజకవర్గానికి వందల ఏళ్ల నాటి చరిత్ర ఉంది. తొలినాళ్లలో పట్టణంగా పేరు తెచ్చుకున్న ఈ ప్రాంతంలో బ్రిటిష్ కాలంలో ఎన్నో చర్చిలు నిర్మించబడ్డాయి. వాటిలో కొన్ని చర్చిలు వందేళ్లు పూర్తి చేసుకుంటే.. మరికొన్ని వందేళ్లు, డెబ్బై అయిదేళ్లు పూర్తి చేసుకోవడానికి చేరువలో ఉన్నాయి. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఆ చర్చిలన్నీ అందంగా ముస్తాబవుతున్నాయి. క్రీస్తు పండగకు క్రైస్తవులు సిద్ధమవుతున్నారు.

- నియోజకవర్గ పరిధిలో అతి పురాతన చర్చిలు
- వందేళ్లు దాటిన సెయింట్ ఆంథోనీ చర్చి

దాబాగార్డెన్స్ : క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమవుతున్నాయి. నియోజకవర్గంలో 200 ఏళ్ల నాటి చర్చిలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మరికొన్ని చర్చిలు వందేళ్లు పూర్తి చేసుకున్నాయి. పురాతన చర్చిల్లో లండన్ మిషన్ మెమోరియల్ సీఎస్ఐ చర్చి, సెయింట్ ఆంథోనీ చర్చి, సెయింట్ అలోసిస్, సెయింట్ జాన్స్, సెయింట్ ప్యారీస్, సెయింట్ పీటర్స్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, క్రైస్ట్ చర్చి ఇలా ఎన్నో చర్చిలు వందేళ్లు పూర్తి చేసుకున్నాయి. వాటిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కోవిడ్ నియమ నిబంధనల మేరకే క్రిస్మస్ వేడుకలు జరపనున్నారు.

లండన్ మిషన్‌కు 216 ఏళ్లు..

వివిధ దేశాల్లో 'సువార్త సేవా కార్యక్రమాలు'ని ర్వహించేందుకు లండన్ మిషనరీ సొసైటీ 1794లో లండన్ పట్టణంలోని కాఫీహౌస్‌లో ఆవిర్భవించింది. ఆ మిషన్‌కు సంబంధించి రెవ. రింగిల్ టాబే, రెవ. జార్జిక్రాస్, రెవ. అగస్టస్ డెస్ గ్రాంజెస్ మిషనరీలు భారతదేశానికి తమిళనాడులోని ట్రాన్‌కోబార్ (తరంగంబాడీ) కేంద్రంగా సువార్త సేవ కోసం 1804లో వచ్చారు. వీరు గాస్‌పోర్ట్ పట్టణంలోని వేదాంత కళాశాలలో వేదాంత విద్యనభ్యసించి 1804 ఫిబ్రవరి 10న గురు పట్టాభిషేకం పొందారు. అదే సమయంలో జార్జ్ క్రాస్, అగస్టస్ డెస్ గ్రాంజెస్ విశాఖపట్నం ప్రాంతానికి సువార్త సేవ కోసం వచ్చారు. వాళ్లిద్దరూ 1805 జూలై 18న వైజాగ్ చేరుకుని ఈస్ట్ ఇండియా కంపెనీచే ఆహ్వానించబడి చాప్లెయిన్స్‌గా నియమించబడి సైనికాధికారుల కోసం ఆరాధన కార్యక్రమాలు నిర్వర్తించేవారు. 1805లో విశాఖపట్నం వచ్చిన ఎల్ఎంఎస్ మిషనరీలు మిషన్ హౌస్‌ను వారి స్థావరంగా ఏర్పరచుకున్నారని తెలుస్తోంది. అందులో 1809 ఫిబ్రవరి 12న మహారాష్ట్ర బ్రాహ్మిణ్ కాన్వర్ట్ ఆనంద లాయర్‌చే తెలుగులో ఆదివారపు ఆరాధన నిర్వహించడింది. ఇదే తెలుగులో నిర్వహించబడిన ప్రప్రథమ క్రైస్తవ ఆరాధనగా చెప్పవచ్చు. ఈ విధంగా ఆరాధనలు కొనసాగుతుండగా సుమారు 25 ఏళ్ల తర్వాత విశాఖలో పరిచర్య ప్రారంభించిన రెవ. జె డబ్ల్యూ గార్డన్ ఆలయ నిర్మాణ అవసరాన్ని గుర్తించి లండన్ మిషన్ ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఆయన రెండేళ్ల వ్యవధిలోనే రెండు దేవాలయాలు నిర్మించినట్టుగా ఆ ఉత్తరంలో పొందుపరిచారు. ఈ రెండు ఆలయాల్లో ఒక ఆలయం వన్‌టౌన్‌లోని ప్రస్తుత ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కాగా, రెండవది మెయిన్‌రోడ్డులోని ఎల్ఎంఎం దేవాలయం.


75 ఏళ్లు పూర్తి చేసుకున్న క్రైస్ట్ చర్చి


200 ఏళ్లు పూర్తి చేసుకున్న లండన్ మిషన్ మెమోరియల్ చర్చి


వందేళ్లు పూర్తి చేసుకున్న సెయింట్ ఆంథోనీ చర్చి

ప్రఖ్యాతి గాంచిన ఆంధ్ర క్రైస్తవ కీర్తనల రచయిత రెవ. పులిపాక జగన్నాథం 37 ఏళ్ల సుదీర్ఘకాలం గురువుగా సేవలందించారు. కవిసామ్రాట్ పురుషోత్తమ చౌదరి ఎల్ఎంఎస్ మిషనరీలతో సహచర్యులుగా క్రైస్తవ విశ్వాసం ప్రకటిస్తున్న కాలంలో ఎల్ఎంఎస్ సంఘాలతో అనుబంధంగా పరిచర్య చేశారు. ప్రస్తుతం ఈ చర్చికి విన్సెంట్ రాజ్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

సెయింట్ ఆంథోనీ చర్చి..

నగరంలోని మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ చర్చి వందేళ్ల పైబడినదే. ఈ చర్చికి 105 ఏళ్ల చరిత్ర ఉంది. 1917లో చర్చిని ప్రారంభించారు. 2017 నాటికి వందేళ్లు పూర్తి చేసుకున్న ఈ చర్చిని 1972లో అధునాతనంగా రూపొందించారు. ప్రతి ఆదివారంతో పాటు క్రిస్మస్, గుడ్‌ఫ్రైడేకి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ చర్చి ఫాదర్ బాలసౌరి ఆధ్వర్యంలో నడుస్తోంది.

క్రైస్ట్ చర్చికి 76 ఏళ్లు..

పాతనగరంలోని చెంగల్రావు పేటలో గల క్రైస్ట్ చర్చి (బాప్టిస్ట్) చర్చిని 1948లో ప్రారంభించారు. చెంగల్రావుపేటలో గల హోప్‌హాల్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో ప్రారంభంలో హోప్‌హాల్ చర్చిని స్థాపించారు. చెముడు మహారాణి 600 గజాల స్థలాన్ని అందజేయడంతో 1957లో నూతన చర్చిని 12 మంది దేశీయ నాయకులు నిర్మించారు. అనంతరం హోప్‌హాల్ బాప్టిస్ట్ చర్చికి క్రైస్ట్ చర్చిగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఈ చర్చి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ 2023 జనవరి ఒకటి నాటికి 75 ఏళ్లు పూర్తి చేసుకుంది.

మాట తప్పని నేత సీఎం జగన్


ప్రజలతో మాట్లాడుతున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని చిన్నపాలికలవారి వీధితో పాటు పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ దఫదఫాలుగా పెంచుతూ జనవరి ఒకటి నుంచి రూ. 3 వేలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పద్మనాభం అమ్మాజీ, రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పాలికల సోమినాయుడు, సచివాలయ కన్వీనర్లు అంగటికుమారి, ఎస్.మల్లేశ్వరి, చిట్టిబోయిన శివ శంకర్‌కుమార్, గృహసారథులు పి.త్రినాథ్, జె.పి.రాజా, పాలికల వీర్రాజు, బాడితమాని వెంకటలక్ష్మి, పి.రమణమ్మ, టీకేటి లక్ష్మి, ఎం. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘోషా ఆస్పత్రిలో రూ. 10 భోజనం పంపిణీ

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు పది రూపాయల భోజనాలు అందించారు. అలయన్స్ క్లబ్ 13 రోజుల పాటు పది రూపాయలకు నాణ్యమైన భోజనాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విక్టోరియా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు రూ. 10 భోజనాలు ఇవ్వవలసిన అవసరం ఉందని, దాతలు సహకరించాలన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత


బీమా నగదు అందజేస్తున్న బిపిన్‌కుమార్ జైన్, బాపూ ఆనంద్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు చిలకపేట-2 సచివాలయ పరిధి గొల్లలపాలెం ప్రాంతానికి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమాను ఆ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు చనిపోయిన వ్యక్తి నామినీ అకౌంట్లో ప్రభుత్వం జమ చేయనుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ రేవతి పాల్గొన్నారు.

అవగాహనతోనే పరిసరాల పరిశుభ్రత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ : ఎకో వైజాగ్ స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని గణేశ్వర పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు హాజరయ్యారు. పిల్లలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తే ఇంటి వద్ద తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తారన్నారు. దీని వలన ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ మల్లిబాబు, మంగరాజు, కంటిపల్లి వరలక్ష్మి రమణమ్మ పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు



పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ : శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 మందికి కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూడు దశలుగా శస్త్ర చికిత్సలు జరిగాయి. ఈ మేరకు ఆపరేషన్లు చేయించుకున్న వారందరికీ సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పండ్లు, రొట్టెలు, తువాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో క్రిస్మస్ వేడుకలు

మహారాణిపేట : కేజీహెచ్ సెంట్రల్ ల్యాబ్‌లో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపరింటిండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోగులకు దుప్పట్లు, అవసరమైన సామగ్రి అందజేశారు. డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ లక్ష్మీతులసి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఏపీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ల్యాబ్ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన క్రిస్మస్ సందడి


సెయింట్ ఆంథోనీ చర్చి వద్ద క్రిస్మస్ సామగ్రి కొనుగోలు చేస్తున్న క్రైస్తవులు

దాబాగార్డెన్స్ : క్రిస్మస్ సందడితో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. జగదాంబ జంక్షన్‌లోని సెయింట్ ఆంథోనీ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, సెవెంత్ డే అడ్వెంటిస్ట్, బాప్టిస్ట్ చర్చి ప్రాంతాల్లో క్రిస్మస్ సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. నక్షత్రాలు (స్టార్స్), క్రిస్మస్ ట్రీ, గంటలు, బెలూన్లు, శాంతాక్లాజ్ దుస్తులు, పశువుల పాకల సెట్లు విక్రయిస్తుండగా, పలు పాఠశాలలు చిన్నారుల క్రిస్మస్ సందడితో నిండుగా కనిపిస్తున్నాయి.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు


విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం నాగభూషణం, శ్రీహరిరెడ్డి

జగదాంబ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ పాఠశాలలో 217 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. లక్షలాది మంది పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.1500 కోట్లు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సరళీకరించేందుకే ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ఇటువంటి మహోన్నత కార్యక్రమంపై కూడా బురద జల్లడం సమంజసం కాదన్నారు. రామోజీరావు పిచ్చిరాతలు రాస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్క విద్యార్థికి రూ. 33 వేలు విలువ గల ట్యాబ్‌లు అందజేశారని, వాటిలో విద్యార్థులకు ఉపయుక్తమైన మెటీరియల్ పొందిపరచి ఉందన్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, స్టేట్ డైరెక్టర్ సబీరా బేగం, సౌత్ మైనార్టీ సెల్ నాయకులు ముజీబ్‌ఖాన్, 27వ వార్డు ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వి. జోగేంద్రనాథ్, పార్టీ కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో..

అల్లిపురం : జగనన్న విద్యకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారని 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం అధ్యక్షతన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ట్యాబ్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నీలకంఠం, టిలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, బొడ్డేటి ప్రసాద్, ఎల్లంకి చిన్నమ్మలు, ఆదారి వెంకట మహేష్, నీలాపు అయ్యప్పరెడ్డి, భీశెట్టి రాజు తదితరులు విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లల విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై విద్యా బోధన చక్కగా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం


మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం

అల్లిపురం : పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగిస్తున్నారని 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 33వ వార్డు బంగారుమెట్ట సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు కణితి బ్రహ్మం, వేగి వెంకటప్పారావు, కొల్లి సత్యవతి సంయుక్తంగా పార్టీ జెండా, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం కర్రి నీలకంఠం మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు రంధి గోపీకృష్ణ, టెలికాం జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, పచ్చిరిపల్లి రాము, కొడమంచిలి శ్రీను, మాదాబత్తుల రమేష్, పిల్లి శివ, గుణ, పలికల శివరాం హరి, ఎల్లంకి చిన్నమ్మలు, నూకరాజు, బొర్రా శ్రీనివాసరెడ్డి, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 9వ రోజు శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్‌కొత్తరోడ్డు వరకు క్యూలైన్ లో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణగిరిలో దీపారాధన


కొవ్వొత్తులతో దీపారాధన చేస్తున్న మహిళలు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పునీత పేతురు చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌనిల్స్ (పీపీసీ) సంయుక్త అధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 4 గంటలకు సెబాస్టియన్ కాలనీ, బాబూకాలనీ, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో కొవ్వొత్తులతో ప్రదక్షిణలు చేశారు. క్రీస్తు రాక కోసం ప్రజలు భక్తి శ్రద్ధలతో మెలగాలన్నారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని చిత్తుగా ఓడించండి'


నిరసన తెలుపుతున్న ఇండియా వేదిక నాయకులు

సీతమ్మధార : దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీతో పాటు దానికి మద్దతుగా నిలిచే పార్టీలను రాబోయే ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించాలని ఇండియా వేదిక నాయకులు పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం నిరంకుశత్వం, 146 మంది ఎంపీల సస్పెన్షన్, ప్రజాస్వామ్యంపై దాడి వంటి ఘటనలను ఖండిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విపక్ష పార్టీలకు చెందిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసిందని మండిపడ్డారు. పార్లమెంట్‌కే రక్షణ కల్పించలేని మోదీ ప్రభుత్వం ప్రజలను, దేశాన్ని ఎలా రక్షిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.గోవిందరావు, డాక్టర్ సీతల్, వై.కొండయ్య, కె.శంకరరావు, విమల, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో అన్నదానం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సీతంరాజు సుధాకర్ తదితరులు

జగదాంబ : మార్గశిర మాసం సందర్భంగా దుర్గాలమ్మ ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ 35వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్ హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లిబాబు, ధర్మకర్తలు మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి అమ్మవారికి అధివాస మహోత్సవం రేపు

దాబాగార్డెన్స్ : భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్, భువనేశ్వరి ఆరాధన పీఠం సంయుక్త ఆధ్వర్యంలో సబ్బవరం మండలం ఆరిపాక పంచాయతీలో ఈ నెల 24న భువనేశ్వరి అమ్మవారికి తమలపాకు పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు ఓం భువనేశ్వరి ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారికి పంచమి, స్వాతి నక్షత్రం, గాదిచెట్టు పత్రితో అధివాస మహోత్సవం జరిపేందుకు పండితులు, పెద్దలు నిర్ణయించారని తెలిపారు.

ఎక్మో చికిత్సతో అరుదైన వైద్యం


మాట్లాడుతున్న క్రిటికేర్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్

మహారాణిపేట : పలు సమస్యలతో అత్యంత విషమంగా ఉన్న 54 సంవత్సరాల వ్యక్తికి కేర్ ఆస్పత్రిలో ఎక్మో ద్వారా చికిత్సను విజయవంతంగా అందించినట్టు క్రిటికేర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ మోనంగి తెలిపారు. శుక్రవారం రామ్‌నగర్ కేర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. రోగి తమ వద్దకు వచ్చేసరికి అత్యంత విషమంగా ఉన్నారని, ఎక్మోపై 14 రోజుల సుదీర్ఘ చికిత్స తర్వాత రోగి కోలుకున్నారని తెలిపారు. రోగి మాట్లాడుతూ తనకు పునర్జన్మనిచ్చిన వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ టి.ఎల్.రాణి, డాక్టర్ రాము, డాక్టర్ శ్రీనివాస్ మోనంగి ఆధ్వర్యంలో సంక్లిష్టమైన చికిత్సను అందించినట్టు ఆస్పత్రి పరిపాలనాధికారి శ్రీనివాస్ వద్దిపర్తి తెలిపారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

17,505 గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ మీటర్లు

సీతంపేట (పార్వతీపురం మన్యం) : ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 3,761 గిరిజన గ్రామాల్లో 17,505 గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డైరెక్టర్ (ప్రాజెక్టులు) ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీలో పీవీటీజీ గిరిజనులకు ఎన్ని కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లేవనే దానిపై సర్వేచేస్తున్నామన్నారు. ఈ నెల 24 నాటికి సర్వే పూర్తవుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 2,095 హేబిటేషన్లలో 13,600ల గృహాలకు విద్యుత్ సదుపాయం లేదని అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు అందాయన్నారు. విజయనగరం జిల్లాలో 553 హేబిటేషన్లకు 1367, ఏలూరులో 95 గ్రామాల్లో 409, తూర్పుగోదావరి జిల్లాలో 625 గ్రామాలకు 4013 కుటుంబాలకు విద్యుత్ మీటర్లు లేవన్నారు. అలాగే, శ్రీకాకుళంలో 451 హేబిటేషన్లకు 1468 ఇళ్లకు విద్యుత్ సదుపాయం లేదన్నారు. వీటన్నింటికీ యుద్ధప్రాతిపదికన ఉచిత కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి, ఏఈ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి వైకుంఠ శోభ


వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం

అల్లిపురం : బల్లిగిరి వైకుంఠ శోభ సంతరించుకుంది. ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి వెంకన్న ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధమైందని ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. దేవాలయం ప్రాంగణం పూలమాలికలు, మామిడి తోరణాలతో విశేషంగా అలంకరించారు. ఈ ఏడాది శనివారం వైకుంఠ ఏకాదశి కావటంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండవచ్చన్నారు. తెల్లవారు జామున స్వామివారి తిరువీధి ఉత్సవం వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు.

అలమేలు మంగమ్మ ఆలయంలో..

అలమేలు మంగమ్మ ఆలయంలో అలమేలు మంగమ్మతో పాటు గోదాదేవి దర్శనానికి ఉత్తరద్వారం గుండా భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు ఆలయ అర్చకులు కేశవాచార్యులు తెలిపారు.

రాంరాం మందిరంలో..

గోవింద్‌రోడ్డులో గల రాంరాం మందిరంలో ఏకాదశి సందర్భంగా దేవాలయంలో ఏకాహం చేపట్టారు.

ప్రజా సౌకర్యార్థం రోడ్డు విస్తరణ పనులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 పరిధి మాధవధార మెయిన్ రోడ్డు నుంచి అక్కయ్యపాలెం, నరసింహనగర్ రైతుబజార్ వరకు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మ్యారెట్ హోటల్ జంక్షన్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. స్థానికులకు కొంత ఇబ్బంది కలిగించినప్పటికీ ప్రజల సౌకర్యార్థమై విస్తరణ పనులు చేపట్టామన్నారు. జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఇవి జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానికులు అభ్యంతరం తెలిపినప్పటికీ వారందరికీ నచ్చచెప్పి విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఈ రోడ్డు విస్తరణలో 22 భవనాలు ఉండగా.. వీటిలో ముగ్గురు కోర్టును ఆశ్రయించడంతో వారికి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ వారితో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలో ఆ భవనాల తొలగింపునకు కూడా చర్యలు చేపడతామన్నారు. అందరికీ నష్ట పరిహారం చెక్కులు ఇప్పటికే సిద్ధమయ్యాయని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

గణితంలో ప్రతిభ చాటిన విద్యార్థులు


గణిత సూత్రాలు, గుర్తులు, ఆకారాలతో కూడిన ముగ్గు


మహిళా కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రకాశరావుపేట మున్సిపల్ పాఠశాల పదో తరగతి విద్యార్థులు లెక్కలపై ప్రయోగం చేశారు. గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు, మ్యాథ్స్ ఉపాధ్యాయులు డి. శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఖ్యలు.. వర్గాలు.. గణిత సూత్రాల పరికరాలను పిల్లలు ప్రదర్శించారు. గణిత సూత్రాలు, గుర్తులు, ఆకారాలతో కూడిన గణిత ముగ్గు, వాస్తవ సంఖ్యలు, దానిలో రకాలు తెలిపే నెమలి, 3డీ ఆకారాలు, పైథాగరస్ సిద్ధాంతాన్ని వివరించే పరికరం ప్రదర్శించారు.

మహిళా కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్. శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో..

రామానుజన్ జయంతి సందర్భంగా ఏవీఎన్ కళాశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పి. గాంధీ, శంకర నారాయణ, మల్లిక, అనంతలక్ష్మి, అనిత, శ్రీలత, ప్రమీలాకుమారి, పైడి రజని, సంతోష్‌కుమార్, డాక్టర్ ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆహారం పంపిణీ


ఆహార పొట్లాలు అందజేస్తున్న విజయ్

దాబాగార్డెన్స్ : పేద పిల్లల్ని చదివిస్తున్న మనసున్న నాయకుడు.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం, క్రిస్మస్ పండగను పురస్కరించుకుని పలువురు అభాగ్యులకు జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని విజయ్ శుక్రవారం ఆహార పొట్లాలు అందజేశారు. స్టేషన్ రోడ్డు, రైల్వేస్టేషన్ కూడలి ప్రాంతాల్లో గల అభాగ్యులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. గుత్తుల గురుమూర్తి, పి. రఘు, రాజు, మహ్మద్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.